క్లుప్తంగా

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న ఎస్‌ఐ అనిత

ధారూరు: ధారూరు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎస్‌ఐ అనిత, ఏఎస్‌ఐ అంజాద్, సిబ్బందితో కలిసి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఆశ వర్కర్ల నిరసన



కోట్‌పల్లి పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న ఆశ వర్కర్లు

బంట్వారం: తమని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ కోట్‌పల్లి మండలంలోని ఆశ వర్కర్లు శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా కాలంగా పని చేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు పని భారం తగ్గించి మూడోతరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

కోత్లాపూర్‌లో రేషన్ బియ్యం పంపిణీ

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోత్లాపూర్ గ్రామంలో శుక్రవారం నూతన రేషన్‌కార్డుదారులకు బియ్యం పంపిణీ చేశారు. గ్రామంలో 70 మందికి కొత్త రేషన్‌కార్డులు వచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిలు, నవీన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శంషోద్దీన్, రాజు, వెంకట్‌రెడ్డి, వెంకటప్ప, నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

మార్చి31 వరకు చెల్లిస్తే 25శాతం రాయితీ

ధారూరు: వెంచర్లు, ప్రైవేటు వెంచర్ల యజమానులు మార్చి 31 వరకు ఎల్‌ఆర్‌ఎస్ చెల్లిస్తే 25శాతం రాయితీ ఇస్తామని శుక్రవారం ధారూరు గ్రామకార్యదర్శి అంజ్యానాయక్ పేర్కొన్నారు. ఇంతవరకు ధారూరు జీపీలో 632 దరఖాస్తులు వచ్చాయని, వాటిని తనిఖీ చేసి ఆమోదం తెలిపినట్లు ఆయన వివరించారు. సంబంధిత ప్లాట్‌దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

శోభాయమానంగా శకటోత్సవం



పాంబండపై శకటోత్సవంలో భక్తులు

కుల్కచర్ల: పాంబండ రామలింగేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామంలోని పాంబండపై శకటోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర



బోనాలు సమర్పిస్తున్న మహిళలు

దుద్యాల్: మండలంలోని కుదురుమల్ల గ్రామంలో నాగ ఎల్లమ్మ జాతర శుక్రవారం ఘనంగా జరిగాయి. గ్రామ శివారులోని మర్రి చెట్టులో వెలసిన అమ్మవారికి గ్రామస్తులు బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా కబడ్డీ, రెట్టపట్లు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సత్కారం

షాద్‌నగర్: బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన పతంగి రాజభూపాల్‌గౌడ్‌ను శుక్రవారం పార్టీ షాద్‌నగర్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శంషాబాద్‌లోని ఆయన నివాసానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరు వెంకటేష్‌గుప్తా, దేపల్లి అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు తరలివెళ్లారు.

కోట్‌పల్లి కుండలు భలే!

- కుల వృత్తే వారికి జీవనాధారం
- కరువైన ప్రభుత్వ ఆదరణ



పచ్చడి కుండలు తయారు చేస్తున్న కుమ్మరి



తయారు చేసిన కుండలను కాల్చే బట్టీ

బంట్వారం: తాతల కాలం నుంచి కుల వృత్తినే నమ్మి జీవనం సాగిస్తున్న కుమ్మరులకు ప్రభుత్వ ఆదరణ కరువైంది. అయినప్పటికీ వారు అదే పని చేస్తూ బతుకు బండి లాగుతున్నారు. కోట్‌పల్లి మండల కేంద్రంలో సుమారు 30 కుటుంబాలు ఈ వృత్తి పైనే ఆధారపడి జీవిస్తున్నారు. పూర్వికుల నుంచి నేటి వరకు తమ వృత్తినే నమ్ముకుని బతుకుతున్నారు. ఈ వృత్తిలో కష్టమైనా, నష్టమైనా సరే ఇష్టంగా కులవృత్తి చేసుకుంటున్నారు. వర్షాకాలం మినహా మిగతా 8 నెలలు కుండలు తయారీయే వారికి ఆధారం.

తయారి..

కుంట మట్టిని గోధుమ పిండి మాదిరిగా సిద్ధం చేసుకుంటారు. దూరాన్ని బట్టి ఒక్కో ట్రాక్టర్ మట్టికి రూ.4 నుంచి 5 వేలకు పైగా చార్జి చెల్లిస్తారు. 40 సంవత్సరాల నుంచే కోట్‌పల్లి కుండలకు పెట్టిందే పేరు. అప్పట్లో వివిధ రకాల మట్టి కుండలతో పాటు పొయ్యిలు, వంట పాత్రలను తయారు చేసే వారు. దీంతో తయారైన కుండలను గాడిదలపై వేసుకుని చుట్టుపక్కల గ్రామాల్లో విక్రయించే వారు. ఆటోల్లో తరలించి సంతల్లో కూడా ఈ కుండలను అమ్ముకుంటున్నారు. అవసరాన్ని బట్టి వివిధ ప్రాంతాల నుంచి సైతం కోట్‌పల్లికి వచ్చి కుండలు కొనుగోలు చేస్తున్నారు.

తగ్గిన గిరాకీ..

ఒకప్పుడు వేసవి వచ్చిందంటే చాలు పేదోడి ఫ్రిజ్‌కు భలే డిమాండ్ ఉండేది. నేడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. చల్లటి నీరు కోసం కొందరు రిఫ్రిజిరేటర్లను కొనుగోలు చేస్తున్నారు. ఇంకొందరు మట్టి కుండలను అక్కడక్కడ వాడుతున్నారు. ఉగాది పచ్చడికి మాత్రం తప్పనిసరిగా మట్టి కుండలనే కొనుగోలు చేస్తున్నారని తయారీ దారులు చెబుతున్నారు. కుండల సైజును బట్టి రేట్లు నిర్ణయిస్తారు. వచ్చిన ఆదాయంతోనే వారు సరిపెట్టుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ మట్టి కుండలో నీటిని తాగితే ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు సూచనలు ఇస్తున్నారు.

కుమ్మరులను ఆదుకోవాలి

చాలా కాలంగా కుల వృత్తినే నమ్ముకున్నాం. ఇప్పటికీ ఇదే పనిని కొనసాగిస్తున్నాం. కుండలకు గిరాకీ తగ్గింది. వేసవిలో మాత్రమే డిమాండ్ ఉంటుంది. పండుగలకు బాగానే కొనుగోలు చేస్తారు. పెద్దగా లాభాలు లేకపోయిన కుల వృత్తిని మరువలేక, తెలిసిన పనిని వదలలేక కుండలు తయారు చేసుకొని అమ్ముకుంటున్నాం. ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆర్థిక సహాయం అందడం లేదు. ఇప్పటికైనా సబ్సిడీ రుణాలు మంజూరు చేసి కుమ్మరులను ఆదుకోవాలి.

–బాలమ్మ, కోట్‌పల్లి



ఫ్రిజ్ కంటే కుండ నీటికె మొగ్గు..

కొడంగల్ రూరల్: ఎండలు పెరుగుతుండడంతో మట్టి కుండలకు డిమాండ్ పెరుగుతోంది. వేసవి కాలం వచ్చిందంటే చల్లటి నీటి కోసం ఆరాటపడతారు. వినియోగదారులను ఆకర్షించడానికి మార్కెట్లో వివిధ రకాల కుండలు, కూజలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిని సంపన్నులు సైతం కొనుగోలు చేస్తున్నారు. మట్టి కుండల్లో నీటిని తాగితే ఆరోగ్యంగా ఉంటారని వినియోగదారులు చెబుతున్నారు.

వేసవిలో మాత్రమే గిరాకీ

వివిధ రకాల డిజైన్లతో కూడిన రకరకాల కుండలు, కూజలకు వేసవిలో మాత్రమే గిరాకీ ఉంటుందని వృత్తిదారులు చెబుతున్నారు. డిజైన్లను బట్టి ధర ఉంటుంది. మార్కెట్‌లో రూ.70 నుంచి రూ.300ల వరకు అందుబాటులో ఉన్నాయి. గతంలో అంతా మట్టితో తయారుచేసిన సామగ్రిని కొనుగోలు చేసేవారని ప్రస్తుతం కుండలకు గిరాకీ తగ్గిందని చెబుతున్నారు.



కొడంగల్ రూరల్: ప్రధాన రహదారి పక్కన అమ్మకానికి ఉంచిన మట్టి కుండలు

పోలీసులకు సమాచారం చేరవేశాడని..

వీర్‌శెట్టిపల్లిలో వ్యక్తిపై దాడి

తాండూరు రూరల్: తాండూరు మండలం వీర్‌శెట్టిపల్లి గ్రామంలో ఓ వ్యక్తిపై ఇసుక మాఫియా దాడి చేసిన సంఘటన కలకలం రేపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. తాండూరు మండలం వీర్‌శెట్టిపల్లి గ్రామ శివారులోని కాగ్నానది నుంచి అక్రమార్కులు ఇసుకను తరలిస్తున్నారనే విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన ఫిరంగి జర్నప్ప శుక్రవారం రాత్రి 2 గంటల సమయంలో కరన్‌కోట్ పోలీసులకు ఫోన్‌లో సమాచారం చేరవేశారు. దీంతో ఎస్‌ఐ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేశాడనే కోపంతో జర్నప్పను ఇసుక మాఫియా గ్యాంగ్ శుక్రవారం అర్ధరాత్రి అతనిపై దాడి చేశారు. దీంతో అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇసుక మాఫీయా అర్ధరాత్రి ఊళ్లకు వచ్చి దాడి చేయడంపై గ్రామస్తులు భయందోళనకు గురవుతున్నారు. ఈ విషయంలో పోలీసులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ వద్ద ట్రాక్టర్లు

రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు..

తాండూరు మండలం వీర్‌శెట్టిపల్లి గ్రామ శివారులోని కాగ్నా నది నుంచి అక్రమంగా తరలిస్తున్న యాలాల మండలం అగ్గనూర్ గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

నగదు బహుమతి అందజేత

అనంతగిరి: జిల్లాలో గత సంవత్సరంలో పదోతరగతిలో పది జీపీఏ సాధించిన ప్రయివేట్ పాఠశాల విద్యార్థులకు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు, విజ్ఞన సరోవర ప్రచారణ అధినేత కొండా లక్ష్మారెడ్డి నగదు బహుమతి అందజేశారు. శుక్రవారం వికారాబాద్‌లోని శ్రీ వివేకవాణి విద్యాలయంలో నిర్వహించిన సమావేశంలో 38మంది విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున అందజేశారు. రాష్ట్రంలో తొలిసారిగా వికారాబాద్ జిల్లాలో తమ సంస్థ ఆధ్వర్యంలో ఇస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోర్‌కమిటీ మెంబర్ నాగయ్య, జాయింట్ సెక్రటరీ బస్వరాజు, రాష్ట్ర సలహాదారుడు రహమాన్, జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కోశాధికారి ప్రకాశ్, నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల తరఫున నగదు పారితోషికం అందుకుంటున్న కరస్పాండెంట్ ధన్‌శెట్టి

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

శంకర్‌పల్లి: మండల పరిధిలోని దొంతాన్‌పల్లిలో ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో త్రితి–2025 పేరుతో మూడు రోజుల పాటు వార్షిక సాంకేతిక–సాంస్కృతిక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ఎల్.ఎస్ గణేశ్, రిజిస్ట్రార్ విజయలక్ష్మిలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు పాటలు, నృత్యాలు, ర్యాంప్ వాక్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మూడు రోజుల పాటు ఇవి కొనసాగనున్నాయి. శుక్రవారం ఆడిటోరియంలో పలువురు విద్యార్థులు చేసిన సాంప్రదాయ నృత్యాలు కట్టిపడేశాయి.

అడవుల సంరక్షణకు చర్యలు

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్ రూరల్: అడవుల సంరక్షణ, పునరుద్ధరణకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని తహసీల్దార్ విజయకుమార్ పేర్కొన్నారు. పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా అటవీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కళాశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అడవులను పరిరక్షించాలన్నారు. దీని కోసం విరివిగా ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలన్నారు. కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం అడవుల సంరక్షణ, పునరుద్ధరణ అనే అంశాలపై పోస్టర్ ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్‌రెడ్డి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ టి.రాంబాబు, వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానమ్, కార్యక్రమ నిర్వాహకులు ఆర్.శ్రీనివాస్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలు

కుల్కచర్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ

కుల్కచర్ల: బాటసారుల దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలని కుల్కచర్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ అన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండల పరిధిలోని మరికల్ గ్రామంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవితాపాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఎండలకు ఈ చలివేంద్రాలు బాటసారులకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యాక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలతో ప్రతిభను వెలికితీయొచ్చు



మోమిన్‌పేట: మేకవనంపల్లి ఉన్నత పాఠశాలలో..

యాలాల: శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించిన క్విజ్‌పోటీల్లో ముద్దాయిపేట ప్రాథమిక పాఠశాలకు మొదటి బహుమతి లభించింది. కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో ముద్దాయిపేటకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వారికి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కాంప్లెక్స్ స్థాయిలో తమ విద్యార్థులు మొదటి బహుమతి గెలుచుకోవడంతో హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు ఆనందం వ్యక్తం చేశారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: క్విజ్ పోటీలతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయొచ్చని మేకవనంపల్లి కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయుడు గౌరిశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం మేకవనంపల్లి కాంప్లెక్సు ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే ఆయా పోటీల్లో పాల్గొనే విధంగా విద్యార్థులను ప్రొత్సహించాలన్నారు. ఈ పోటీల్లో టేకులపల్లి తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి, అంమ్రాదికలాన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రెండోబహుమతి గెలుపొందారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఫౌండేషన్ సభ్యులు రాజు, రమేశ్, లక్ష్మీనారాయణ, సత్యానందం తదితరులు పాల్గొన్నారు.



యాలాల: ప్రశంసా పత్రాలు అందజేసిన ఉపాధ్యాయులు

అరకొర రేషన్ కార్డుల జారీ

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం
- కుటుంబ సభ్యులందరినీ చేర్చకపోవడం అన్యాయం
- మాజీ కౌన్సిలర్ సాహు శ్రీలత



తాండూరు టౌన్: అరకొర రేషన్ కార్డులను జారీ చేసి చేతులు దులుపుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ సాహు శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని బీరాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. వందలాది మంది అర్హులైన ప్రజలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే పదుల సంఖ్యలో కార్డులు జారీ చేశారని పేర్కొన్నారు. అంతే కాకుండా ఓ కుటుంబానికి చెందిన అందరి పేర్లు కార్డులో నమోదు చేయకుండా కేవలం ఒకరిద్దరి పేర్లు నమోదు చేసి కార్డులు జారీ చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిందని గుర్తు చేశారు.

తొలిరోజు ప్రశాంతంగా పది పరీక్షలు

తాండూరు టౌన్: తొలిరోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు నిర్వహించారు. తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, తహసీల్దార్ తారాసింగ్, డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి, ఎంపీడీఓ విశ్వప్రసాద్ ఆయా పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. తాండూరు పట్టణంలో 11, కరన్‌కోట, మల్కాపూర్ పరీక్షా కేంద్రాల్లో కలిపి మొత్తం 2,277 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా తొలిరోజు 15 మంది గైర్హాజరయ్యారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: కరన్‌కోట్ జెడ్పీహెచ్‌ఎస్ సెంటర్లో 165 మంది విద్యార్థులకు గాను ఇద్దరు గైర్హాజరయ్యారు. మల్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ సెంటర్లో 196 మందికి గాను ఇద్దరు గైర్హాజరయ్యారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పెద్దేముల్‌లో ఏడుగురు..

పెద్దేముల్ బాలుర ఉన్నత పాఠశాలలో 196 మంది విద్యార్థులకు గాను 4గురు గైర్హాజరయ్యారు. బాలికల సెంటర్‌లో 162 మందికి ఒక్కరు పరీక్షకు రాలేదు. అలాగే మంబాపూర్ సెంటర్‌లో174 మందికి ఇద్దరు గైర్హాజరయ్యారని ఎంఈఓ నర్సింగ్‌రావు తెలిపారు. మొత్తం ఏడుగురు గైర్హాజరయ్యారు. ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొడంగల్‌లో..

కొడంగల్: మొదటి రోజు పదోతరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ప్రశాంతంగా జరిగాయి. కొడంగల్ పట్టణంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో 912 మంది విద్యార్థులు రాశారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా కనీస సదుపాయాలు కల్పించారు.

యాలాల: పదోతరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. యాలాల బాలుర ఉన్నత పాఠశాల, అగ్గనూరు ఉన్నత పాఠశాల, ప్రతిభ, గౌతమి పాఠశాలలో మొత్తం 689 విద్యార్థులకు గాను ముగ్గురు గైర్హాజరు అయినట్లు ఎంఈఓ రమేశ్ తెలిపారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాలలో మొత్తం 331 మంది విద్యార్థులకుగాను నలుగురు గైర్హాజరయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాలను ఎంఈఓ వెంకట్‌స్వామి తనిఖీ చేశారు.



తాండూరు టౌన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జీజేసీ)లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు

కుల్కచర్లలో..

కుల్కచర్ల: మండలంలో 4పరీక్ష కేంద్రాలు ఉండగా అందులో 778 మంది విద్యార్థులకు గాను 5మంది గైర్హజరయ్యారు. చౌడాపూర్‌లో 264 మందికి ఇద్దరు గౌర్హజరయ్యారు. పరిగి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో మొత్తం 1,448 మంది విద్యార్థులకు 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 1,440 మంది పరీక్షకు హాజరయ్యారు. 8 మంది గైర్హజరయ్యారని మండల విద్యాధికారి గోపాల్ తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలను పరిగి డీఎస్పీ శ్రీనివాస్ పర్యావేక్షించారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని మూడు పరీక్ష కేంద్రాలలో 600మంది విద్యార్థులకు గాను9మంది గైర్హజరయ్యారు. బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని మండల తహసీల్దారు మనోహర్ చక్రవర్తి పరిశీలించారు.

దోమలో..

దోమ: దోమ సెంటర్‌లో 207 మందికి 204 పరీక్షలు రాయగా, ముగ్గరు హాజరు కాలేదు. దాదాపూర్ సెంటర్‌లో 245 మందికి 240 రాయగా ఐదుగురు రాయలేదని అధికారులు తెలిపారు. ఈ పరీక్ష సెంటర్లను మండల విద్యాధికారి వెంకట్, ఎంపీడీఓ గ్యామా, పర్యవేక్షణ అధికారి నరేందర్ తనిఖీ చేశరు.

పది పరీక్షలకు ఒకరు గైరాజరు:

ధారూరు: ధారూరు బాలుర ఉన్నత పాఠశాలలో ఒకరు గైర్హజరయ్యారని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ధారూరు పరీక్ష కేంద్రంలో 150 మంది, కేరెళ్లిలో 141 విద్యార్థులు పరీక్షలు రాశారని ఆయన వివరంచారు.

బంట్వారంలో..

బంట్వారం: బంట్వారం మండలంలోని మోడల్ స్కూల్లో పరీక్షా కేంద్రంలో 201 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. కోట్‌పల్లి మండలానికి సంబంధించి 187 మంది విద్యార్థులు కోట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పరీక్ష రాశారు. పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసి సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

అనంతగిరి: వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి పదో తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సెంటర్ల వద్ద బందోబస్తును పరిశీలించారు. అక్కడ సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. సెంటర్‌లోకి ఇతరులను ఎవరిని అనుమతించొద్దన్నారు.

ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి



తాండూరు రూరల్: పెద్దేముల్లో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి



కొడంగల్ : పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



పరిగి: పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్ తదితరులు



ధారూరు: బోర్డుపై హాల్ టిక్కెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



దోమ: పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు